మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455

# ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :299 ఆదివారం ఆగష్టు 23 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# వృద్ధుల లక్ష్యంగా కోట్ల మోసం

- అమెరికాలో భారత సంతతి యువకుడి అరెస్ట్
- నగదు, బంగారం సేకరణలో కీలక పాత్ర
- కెనడా మార్గంగా ఖతార్ పారిపోవాలన్న యత్నం
- నేరం రుజువైతే 20 ఏళ్ల జైలు



న్యూయార్క్, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): అమెరికాలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసాలకు పాల్పడిన భారత సంతతి యువకుడిని అధికారులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన 21 ఏళ్ల జయ సునిల్‌భారతి గోస్వామి సుమారు 7.5 మిలియన్ డాలర్ల మోసంలో పాల్గొన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ప్రస్తుతం అతనిపై వైర్ మోసం, అక్రమ నగదు లావాదేవీలకు సంబంధించిన అభియోగాలు నమోదు చేయగా, కేసు విచారణ అమెరికా కోర్టులో కొనసాగుతోంది. దర్యాప్తు వివరాల ప్రకారం, నిందితుడు న్యూజెర్సీలో నివసిస్తూ వృద్ధులను మోసగించే అంతర్జాల ఆధారిత ముఠాలో కీలక పాత్ర పోషించాడు. బాధితుల బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో ఉన్నాయని నమ్మించి వారిని భయాందోళనలకు గురిచేసేవారు. అనంతరం తమ ఆస్తులను నగదు, బంగారం లేదా బహుమతి కార్డుల 2

## పెద్ద తండా రహదారికి మంత్రి శంకుస్థాపన



- రూ. 2.05 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- అభివృద్ధి పనులపై పొన్నం సమీక్ష
- గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు
- సాగునీరు అందిస్తామని హామీ

2

## తెలంగాణ-లివర్‌పూల్ వ్యూహాత్మక భాగస్వామ్యం



- లండన్‌లో ముఖ్యమంత్రితో కీలక భేటీ
- జీవశాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి
- క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో సహకారం
- అక్టోబరులో హైదరాబాద్‌కు ప్రతినిధి బృందం

2

## ప్రెస్ క్లబ్స్ సమాఖ్యను ప్రారంభించిన భట్టి



- హైదరాబాద్‌లో జాతీయ స్థాయి వేదిక ఆవిష్కరణ
- పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి కీలకం
- విశ్వసనీయతే జర్నలిస్టు ప్రధాన ఆస్తి
- జర్నలిస్టుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

2

## భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం




-ప్రపంచ ఆశాకిరణంగా భారత్: ప్రధాని
-వరల్డ్ లీడర్స్ ఫోరంలో కీలక ప్రసంగం
-ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహక విధానాలు
-స్థిరత్వమే దేశ ప్రగతికి పునాది

3

## వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లు



- మూడో విడత పరిహారం అందజేసిన ముఖ్యమంత్రి
- 2,027 కుటుంబాలకు లబ్ధి చేకూరింపు
- 48 రోజుల్లో రూ.768 కోట్ల చెల్లింపు
- పునరావాసానికి ప్రభుత్వం ప్రాధాన్యం

2


## రాజా బహదూర్ విగ్రహావిష్కరణ ఘనంగా



- విద్యాభివృద్ధికి వెంకట్రామారెడ్డి సేవల ప్రశంస
- పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపు
- హాస్టల్, పాఠశాల ఏర్పాటుకు సహకారం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2

## ఏపీలో 10,060 ఉద్యోగాల భర్తీ



- నిరుద్యోగులకు భారీ శుభవార్త
- వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల
- నాలుగు దశల్లో నియామక ప్రక్రియ
- సెప్టెంబర్, అక్టోబర్‌లో నోటిఫికేషన్లు

అమరావతి, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. మొత్తం 10,060 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన వార్షిక జాబ్ క్యాలెండర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఆర్థిక శాఖ నుంచి అవసరమైన 3

# వృద్ధుల లక్ష్యంగా కోట్ల మోసం

మెదటి పేజీ తరువాయి



రూపంలో మార్చుకోవాలని సూచిస్తూ మోసానికి పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ముఠా సభ్యులు పోలీసులమంటూ బాధితులను సంప్రదించి, వారి వద్ద నుంచి నగదు మరియు బంగారాన్ని స్వాధీనం చేసుకునేవారని దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో గోస్వామి మధ్యవర్తిగా వ్యవహరించినట్లు కోర్టు పత్రాలు వెల్లడించాయి. న్యూయార్క్, న్యూజెర్సీ ప్రాంతాల్లో కనీసం తొమ్మిది సందర్భాల్లో వృద్ధుల నుంచి నగదు, బంగారం సేకరించినట్లు అధికారులు గుర్తించారు. బాధితుల వయస్సు 59 నుంచి 87 సంవత్సరాల మధ్య ఉండటం గమనార్హం. వెస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఈ మోసాల జాడలు బయటపడినట్లు సమాచారం. జనవరిలో ఈ వ్యవహారం వెలుగులోకి రాగా, అమెరికా అంతర్గత ఆదాయ శాఖ నేర పరిశోధన విభాగం ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టింది. మోసాల ద్వారా సేకరించిన నిధులను వివిధ మార్గాల్లో బదిలీ చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా గోస్వామి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా తెరిచి సుమారు 90 వేల డాలర్ల నగదును జమ చేసినట్లు బయటపడింది. 2025 ఆగస్టు నుంచి 2026 ఏప్రిల్ వరకు ఈ అక్రమ వ్యవహారం కొనసాగినట్లు అధికారులు పేర్కొన్నారు. సేకరించిన నిధుల మూలాలు, ఇతర సహచరుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ నెల 17న అమెరికా మెజిస్ట్రేట్ న్యాయమూర్తి మార్క్ డబ్ల్యూ పీడర్సెన్ కొన్ని షరతులతో గోస్వామికి బెయిల్ మంజూరు చేశారు. అయితే మరుసటి రోజే అతడు పీస్ బ్రిడ్జ్ మార్గంగా కెనడాకు పారిపోయాడు. అనంతరం టొరంటో నుంచి ఖతార్ రాజధాని దోహాకు విమాన టికెట్ బుక్ చేసుకున్నాడు. కానీ టొరంటో విమానాశ్రయంలోనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నేరం రుజువైతే గోస్వామికి గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని అమెరికా అధికారులు వెల్లడించారు

# పెద్ద తండా రహదారికి మంత్రి శంకుస్థాపన

సిద్దిపేట, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం పెద్ద తండా అభివృద్ధికి కీలకమైన రహదారి పనులకు రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. రూ.2.05 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పెద్ద తండాఅవ్వకుంట బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో పూర్తిచేసిన అంతర్గత సీసీ రోడ్లను కూడా మంత్రి ప్రారంభించారు. రవాణా సౌకర్యాల మెరుగుదలతో గ్రామ ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజల సమస్యలను మంత్రి నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.3.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రైతు భరోసా, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నీటి సంరక్షణపై గ్రామ ప్రజల్లో అవగాహన పెరగాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తే మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

మెదటి పేజీ తరువాయి



# తెలంగాణ-లివర్‌పూల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

లండన్, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకునేందుకు బ్రిటన్‌లోని లివర్‌పూల్ నగరం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు లివర్‌పూల్ నగర అభివృద్ధి విభాగ కార్పొరేట్ డైరెక్టర్లు సుసాన్ ఫిన్నెగన్, నువాలా గల్లాఘర్ తమ సహచరులతో కలిసి లండన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సమావేశంలో రెండు ప్రాంతాల మధ్య భవిష్యత్ సహకార అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. సమావేశంలో జీవశాస్త్ర పరిశ్రమలు, సాంకేతిక రంగం, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వంటి కీలక రంగాల్లో పరస్పర భాగస్వామ్యంపై చర్చ జరిగింది. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, సాంకేతిక వాతావరణం లివర్‌పూల్ ప్రతినిధులను ఆకట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. రెండు ప్రాంతాల మధ్య పెట్టుబడులు, నైపుణ్యాల మార్పిడి, సంయుక్త కార్యక్రమాల అమలుకు అవకాశాలను పరిశీలించారు. జీవశాస్త్ర రంగంలో పరిశోధనలు, వైద్య సాంకేతికత, ఔషధ తయారీ వంటి అంశాల్లో సహకారం పెంపొందించేందుకు పరస్పర ఆసక్తి వ్యక్తమైంది. అలాగే సమాచార సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై కూడా చర్చ సాగింది. క్రీడల రంగంలో ప్రతిభావంతులైన క్రీడాకారుల తయారీ, శిక్షణా కార్యక్రమాలు, అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో సినిమా, డిజిటల్ మీడియా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి సంయుక్తంగా పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో విదేశీ నగరాలు, సంస్థలతో భాగస్వామ్యాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో లివర్‌పూల్‌తో ప్రతిపాదిత భాగస్వామ్యం రాష్ట్రానికి కొత్త అవకాశాలను తెరవగలదని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా పరిశ్రమలు, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఇది దోహదపడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబరులో హైదరాబాద్‌కు రానుంది. ఆ సందర్శన సందర్భంగా పరస్పర అవగాహన ఒప్పందాలు, సంయుక్త కార్యాచరణ ప్రణాళికలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలంగాణ-లివర్‌పూల్ సహకారం రెండు ప్రాంతాల అభివృద్ధికి కొత్త దిశను చూపనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు


మెదటి పేజీ తరువాయి



# వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లు

ప్రకాశం, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు పరిహారం చెక్కును అందజేశారు. ఈ చెల్లింపులతో ఇప్పటి వరకు మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో పరిహారం పంపిణీ చేపట్టింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను చెల్లించింది. తాజాగా మూడో విడతలో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసి పునరావాస ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. వెలిగొండ ప్రాజెక్టు కారణంగా భూములు, ఆస్తులు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ చెల్లింపులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. పరిహారం చెల్లింపులు వేగంగా పూర్తిచేయడం ద్వారా పునరావాస కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. కేవలం 48 రోజుల వ్యవధిలోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల భారీ మొత్తాన్ని చెల్లించడం విశేషమని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని పరిహారం పంపిణీ ప్రక్రియను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు. నిర్వాసిత కుటుంబాలతో వారు ముచ్చటించి ప్రభుత్వ చర్యలపై వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు రాష్ట్రంలో కీలక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రాజెక్టు పనులు పూర్తయితే ప్రకాశం, నెల్లూరు జిల్లాల విస్తార ప్రాంతాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నిర్వాసితుల పునరావాసం, పరిహారం చెల్లింపులను వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు.


మెదటి పేజీ తరువాయి



# ప్రెస్ క్లబ్స్ సమాఖ్యను ప్రారంభించిన భట్టి

హైదరాబాద్, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): దేశంలోని పలు రాష్ట్రాల ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులతో ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు భాగస్వామ్యంగా ఏర్పడిన ఈ వేదిక జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాలకులను ప్రశ్నించే హక్కు మీడియాకు ఉండాలని, విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు కూడా అవసరమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే మీడియా వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత పటిష్టంగా నిలుస్తుందని వివరించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజా చైతన్యంలో జర్నలిజం కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, లోకమాన్య తిలక్ వంటి మహనీయులు పత్రికలను సామాజిక, రాజకీయ మార్పులకు శక్తివంతమైన సాధనాలుగా వినియోగించారని తెలిపారు. సమాజ మార్పులో మీడియా పాత్ర ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ప్రస్తుత కాలంలో సమాచార కొరత లేదని, కానీ విశ్వసనీయత కొరత ఉందని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధస్సు, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులకు విశ్వసనీయతే అత్యంత విలువైన ఆస్తిగా మారిందన్నారు. వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు అందించడం మీడియా ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొనియాడారు. వారు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాల పరిరక్షణకు ఈ సమాఖ్య ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జర్నలిస్టులు అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడంతో పాటు తమ వృత్తి ప్రమాణాలను కూడా కాపాడుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. తెలంగాణ గడ్డ స్వభావంలోనే స్వేచ్ఛగా మాట్లాడే, ప్రశ్నించే సంప్రదాయం ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' బలమైన వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు.

మెదటి పేజీ తరువాయి



# రాజా బహదూర్ విగ్రహావిష్కరణ ఘనంగా

మెదటి పేజీ తరువాయి

సిద్దిపేట, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజా బహదూర్ కొత్వాల్ వెంకట్రామారెడ్డి విగ్రహాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఉపనేత హరీశ్‌రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి 157వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ఒక వ్యక్తి తాను మాత్రమే అభివృద్ధి చెందడం కంటే తనతో పాటు మరికొందరిని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన గొప్పతనమని అన్నారు. ఆ విలువలను ఆచరణలో చూపించిన మహనీయుల్లో రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి ఒకరని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. హైదరాబాద్ కొత్వాల్‌గా పనిచేసిన కాలంలోనే విద్య ప్రాముఖ్యతను గుర్తించి విద్యార్థుల కోసం, ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కోసం రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. ఆ హాస్టల్ ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని, సమాజానికి సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. సిద్దిపేటలో కూడా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హాస్టల్ లేదా విద్యాసంస్థ నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చినట్లు హరీశ్‌రావు తెలిపారు. సంఘ నాయకులు చర్చించి అవసరాన్ని నిర్ణయిస్తే దాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణ చరిత్రను గుర్తు చేసిన హరీశ్‌రావు, ప్రభుత్వంలోకి రాకముందే ఈ భవన నిర్మాణం ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం వివిధ సామాజిక వర్గాలకు కూడా ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఫంక్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య కోసం వినియోగించాలని నూతన కమిటీకి సూచించారు. ఆ నిధుల్లో సగభాగం రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు, మిగతా సగభాగం ఇతర వర్గాల

# భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం




న్యూఢిల్లీ, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అభివృద్ధి, ఆశలకు ప్రతీకగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం2026లో ప్రసంగించిన ఆయన, ప్రపంచం నేడు భారత్‌ను వృద్ధి, అవకాశాలు, స్థిరత్వానికి కేంద్రంగా చూస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన సంస్కరణలను అమలు చేస్తోందని చెప్పారు. విధాన పరమైన మార్పులతో పాటు పాలనా వ్యవస్థలో కూడా తదుపరి తరం సంస్కరణలను చేపడుతున్నామని ప్రధాని తెలిపారు. గతంలో ఉత్పత్తి పెంచిన సంస్థలను శిక్షించే విధానాలు ఉండేవని, ప్రస్తుతం ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహకాలు అందించే వ్యవస్థను అమలు చేస్తున్నామని వివరించారు. లైసెన్స్ రాజ్ కాలంలోని పరిమితుల నుంచి బయటపడి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే దిశగా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని మోదీ చెప్పారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ వ్యవస్థలు, రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో సాధించిన పురోగతి దేశ ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపునిచ్చాయని వివరించారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, విధానాల కొనసాగింపే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్న ప్రధాన అంశాలని ప్రధాని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, స్పష్టమైన విధానాలతో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని చెప్పారు. సురక్షితమైన, స్థిరమైన భారత్ ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తోందని ప్రధాని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక వినియోగం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధిస్తున్నామని చెప్పారు. దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల వేగం మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం ప్రపంచ వ్యాప్తంగా విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు పాల్గొనే ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందింది. ఈ వేదికపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు భారత్ ఆర్థిక భవిష్యత్తు, పెట్టుబడుల అవకాశాలు, సంస్కరణల దిశపై అంతర్జాతీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి.

## నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ 22: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి కాజీపూర్ మంతూర్ గ్రామాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారు హాజరై లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ గారు మాట్లాడుతూ…"కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉంది. గతంలో రేషన్ కార్డుల కోసం ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులతో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది. రేషన్ పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది"బి అని అన్నారు. ఈ స్మార్ట్ కార్డుల వల్ల బియ్యంతో పాటు ప్రభుత్వం అందించే ఇతర సంక్షేమ పథకాలు కూడా సులభంగా అందుతాయని, ఎవరూ అర్హులు మిస్ కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్వాతి గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ , మన్సూర్ గ్రామ సర్పంచ్ యాదగిరి గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఓబి పనులు ప్రారంభం సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించిన తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్




మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 22,:చేగుంట లోని మెదక్ రోడ్డు రైల్వే గేట్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నందున సోమవారం నుంచి గేటును మూసివేస్తున్నట్లు తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. చేగుంట పోలీస్ స్టేషన్లో శనివారం మండలంలోని ప్రజలతోపాటు,వివిధ పరిశ్రమల ప్రతినిధులతో బ్రిడ్జి నిర్మాణం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్ డిఎస్పి మాట్లాడుతూ సోమవారం నుండి పనులు ప్రారంభం కానున్న ఆర్ఓబి పనుల ద్వారా వాహనాలు చేగుంట నుండి చిన్న శంకరంపేట్ పరిశ్రమలకు వెళ్లే వాహనాలు అదేవిధంగా, మెదక్ వెళ్లే వాహనాలు వెళ్లే రూట్లను ప్రజలకు వివరించారు. చిన్న వాహనాలు ఆటోలు చేగుంట బస్టాండ్ సమీపంలోని వెంచర్ నుండి బ్రిడ్జి కింద మెదక్ రోడ్డుకు వెళ్లవచ్చునని తెలిపారు. భారీ వాహనాలు నార్సింగి మండల కేంద్రం నుండి శంకరంపేట మీదుగా మెదక్ కు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు కొనసాగుతున్న ఈ పనుల ద్వారా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డిఎస్పి నరేందర్ గౌడ్ పరిశ్రమల ప్రతినిధులకు ప్రజలకు సూచించారు, ఈ కార్యక్రమంలో రామాయంపేట సిఐ సైదా నాయక్, చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి పోలంపల్లి సర్పంచ్ రాజ్యలక్ష్మి,వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్, నాయకులు కొండి స్వామి తోపాటు వివిధ పరిశ్రమల ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్టుపై దాడిని ఖండించిన కర్రోళ్ల అన్నమ్మ



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.దళిత జర్నలిస్టు పుల్లా రవీందర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్రోళ్ల అన్నమ్మ డిమాండ్ చేశారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవీందర్ ప్రముఖ ఆర్.బి. న్యూస్ సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారని తెలిపారు.స్థానికంగా జరుగుతున్న అక్రమాలపై వార్త ప్రచురించిన నేపథ్యంలో కొందరు వ్యక్తులు అర్ధరాత్రి ఆయన నివాసానికి వెళ్లి దాడి చేశారని ఆరోపించారు.ఈ ఘటనలో రవీందర్‌తో పాటు ఆయన భార్యపై కూడా దాడి చేసి కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కర్రోళ్ల అన్నమ్మ డిమాండ్ చేశారు.జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం,పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఏపీలో 10,060 ఉద్యోగాల భర్తీ




అనుమతులు లభించడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను దశలవారీగా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం నిరుద్యోగుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను ఒకేసారి కాకుండా ప్రణాళికాబద్ధంగా నాలుగు దశల్లో భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉద్యోగార్థులు ముందస్తుగా సిద్ధం కావడానికి వీలుగా నోటిఫికేషన్ల విడుదల తేదీలను కూడా ప్రకటించారు. ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ పరిధిలో 1,500 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వం తెలిపింది. మిగిలిన పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియను వచ్చే రెండు నెలల్లో వేగవంతం చేయనున్నారు.జాబ్ క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ 15న 3,231 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. అనంతరం అక్టోబర్ 15న రెండు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా మరో 5,306 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఒక నోటిఫికేషన్ ద్వారా 2,311 పోస్టులు, మరో నోటిఫికేషన్ ద్వారా 2,995 పోస్టులను భర్తీ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడినట్లవుతుంది. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ ఉద్యోగార్థులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తోంది. గతంలో ఉద్యోగాల భర్తీపై అనిశ్చితి నెలకొనగా, ఇప్పుడు ముందుగానే షెడ్యూల్ ప్రకటించడం ద్వారా అభ్యర్థులు తమ సన్నద్ధతను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభించింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత తమ ప్రణాళికలను ఈ క్యాలెండర్‌కు అనుగుణంగా రూపొందించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. విద్య, పరిపాలన, సాంకేతిక, ఇతర శాఖల్లో ఖాళీల భర్తీ ద్వారా ప్రభుత్వ యంత్రాంగం మరింత బలోపేతం కానుంది. దీంతో ప్రజలకు అందించే సేవల నాణ్యత కూడా మెరుగుపడే అవకాశం ఉంది. ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఈ జాబ్ క్యాలెండర్ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. అక్టోబర్ మధ్య నాటికి మొత్తం నియామక ప్రక్రియ ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో అభ్యర్థులు తమ లక్ష్య సాధన కోసం మరింత కష్టపడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ నియామక ప్రక్రియ యువత భవిష్యత్తుకు కీలక మలుపుగా నిలవనుంది.

## 6వార్డ్ లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ - నర్రా శ్రీజా రెడ్డి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాల గూడ ఆగస్టు 22 : మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆరో వార్డ్ ఇందిరమ్మ కాలనీలో రోడ్లు మురికి కాలువల సమస్యలు విపరీతంగా ఉన్నాయని అలాగే కాలువలు తీసే వర్కర్ల సంఖ్య పెంచాలని కమిషనర్ తెలియజేయగానే ఈరోజు ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు ముఖ్యంగా ముత్యాలమ్మ గుడి దగ్గర కొన్ని సంవత్సరాలుగా మురికి కాలువ సమస్య ఉంది శ్రావణమాసపు బోనాల సందర్భంగా గుడి దగ్గర ఉన్న మురికి కాలువ సమస్యను వెంటనే పరిష్కరించాలని నూతనంగా కాలువ నిర్మాణం చేసి కల్వర్టు వేయాలని స్థానిక కౌన్సిలర్ అశోక్ ద్వారా గుడి కమిటీ సభ్యులు కాలనీవాసులు కమిషనర్ గారికి వివరించడం జరిగింది.అలాగే లేఔట్ త్రీ లో కూడా మురికి కాలువ సమస్యను పరిష్కరించి నూతనంగా కల్వర్టు ఏర్పాటు చేయాలని.లేఅవుట్ ఫోర్ లో మంచినీటి సమస్య బాగా ఉందని వెంటనే నూతన పైప్ లైన్లు వేయాలని కౌన్సిలర్ అశోక్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యలపై స్పందించిన కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి వార్డ్ అధ్యక్షులు అంబటి వెంకటకృష్ణ మిర్యాలగూడ యూత్ అసెంబ్లీ కన్వీనర్ నాగు నాయక్ నిర్మిటి వెంకటరెడ్డి పల్లె భాస్కర్ కొట్ట ఆంజనేయులు గుమ్మడవెల్లి అంజి పెదులుమోరా ప్రభాకర్ దోమలపల్లి సైదులు పాతనబోయిన వెంకటయ్య, కొమ్ము కోటి, బబ్బర్ సింగ్ లేఅవుట్ 4 నుంచి ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు పార్టీ నాయకులు కాలనీ పెద్దలు పాల్గొన్నారు

# జిల్లాలో డ్రగ్స్,గంజాయి అరికట్టాలి




మెదక్ జిల్లా//మనప్రజాప్రతినిధి: మెదక్ ఎస్పీశ్రీనివాసరావు సార్ గారితో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగిందని యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు జగన్ అన్నారు ఆన్లైన్ బెట్టింగ్ , మాదకద్రవ్యాలకు విద్యార్థులు యువకులు దూరంగా ఉండాలని విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా కళాశాల లో నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు. పోరాటాలే కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలను బట్టి విద్యార్థులు చేడు మార్గంలో వెళ్లకుండా వారి భవిష్యత్తును కాపాడే దిశగా ఉన్నత శిఖరాలకు వెళ్ళే దిశగా తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

## నూతన ఇల్లంతకుంట ఎస్సై ఉపేంద్ర చారిని సన్మానం చేసిన పత్రికా విలేకరులు



మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 22 ఆగస్టు :ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ లో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్ర చారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారం చేసిన పత్రిక విలేకరులు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేంద్ర చారి మాట్లాడుతూ ఇల్లంతకుంటమండలంలోని ఎలాంటి సమస్యలైనా నా దృష్టికి తీసుకొస్తే ఆ సమస్యలను పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్రిక విలేకరులు పాల్గొన్నారు.

# 48 గంటల నిరాహార దీక్ష విరమణ

## డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా కంచ రాములు దీక్ష విరమణ



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి పై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు చేపట్టిన నలబై ఎనమిది గంటల నిరాహార దీక్షను జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి ధన్వంతి లక్ష్మీ నారాయణ,చేతుల మీదుగా విరమించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ,మాట్లాడుతూ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి,పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిపై కూడా పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.మంత్రివర్యులు కొండా సురేఖ,కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్టీ క్రమశిక్షణను ప్రతి ఒక్కరూ పాటించాలని,ముఖ్యమంత్రి మరియు పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, కంచ రాములు,చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజల్లో గుర్తింపు పొందాలని కోరుకుంటారని,అయితే బాధ్యతారహితంగా,విచక్షణ లేకుండా మాట్లాడటం సరికాదన్నారు.ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి పై అవాకులు చవాకులు పేల్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎంత ఉందో,క్రమశిక్షణ కూడా అంతే ఉంటుందని డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ అన్నారు.కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జనగామ జిల్లా కేంద్రంలో కంచ రాములు చేపట్టిన నలబై ఎనమిది గంటల నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.కంచ రాములు మాట్లాడుతూ కొండా సురేఖ,కుమార్తె కొండా సుస్మిత,గత కొంతకాలంగా ప్రభుత్వానికి,కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.తండ్రి వయసున్న ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా బాధించిందన్నారు.కొండా సుస్మితను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి,మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే కొండా సురేఖ వ్యవహారశైలిపై కూడా కంచ రాములు తీవ్ర విమర్శలు చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ నాయకులతో సమన్వయం లేకుండా ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తూ పార్టీకి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు.ఇతర నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.కొండా మురళిపై గతంలో కేసులు లేవా? అని ప్రశ్నించిన కంచ రాములు,అలాంటి పరిస్థితుల్లో వారికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శిస్తూ జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి,కొడవటూరు,సిద్ధులగుట్ట ఆలయాల్లో చైర్మన్ పదవులను రెడ్డి సామాజిక వర్గానికి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు.కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై గాంధీభవన్‌తో పాటు అనేక జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కూడా ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు.ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే పార్టీ పదవులతో సంబంధం లేకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి,డాక్టర్ రాజమౌళి,ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాజిద్ అప్సర్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల మల్లేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతకింది మల్లేష్,జాయ మల్లేష్,పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇస్మాయిల్,మేకల సమ్మయ్య,మోతె మల్లేశం,అజారుద్దీన్, గంధమల్ల కమలాకర్, మణి,పోతర్ల ఉప్పలయ్య యాదవ్, నోముల సోమయ్య,బోరెల్లి సిద్ధులు,బాల్దే శ్రీశైలం, అలీమొద్దీన్,మంగ లక్ష్మణ్,అల్వాల రమేష్,షకీల్,తదితరులు పాల్గొన్నారు.

# గురు పురస్కార్‌తో రేగళ్ల సతీష్ రెడ్డి సత్కారం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:కరళ పందలం రాజవంశీకుల చేతుల మీదుగా అవార్డు స్వీకరణ. అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కాప్రాకు చెందిన గురుస్వామి రేగళ్ల సతీష్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'గురు పురస్కార్2026' అవార్డు ప్రదానం చేశారు.చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో మహాసేస్త సేవా సంఘం రాజు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పురస్కార్ ప్రధానోత్సవంలో ఈ అవార్డును కేరళ పందలం రాజవంశీకులు రాజా తిరునల్ సురేష్ వర్మ అందజేశారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 108 మంది గురుస్వాములను ఈ సందర్భంగా సత్కరించి సేవా పురస్కారాలను ప్రదానం చేశారు.అవార్డు అందుకున్న అనంతరం రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. పందలం రాజవంశీకుల చేతుల మీదుగా ఈ గౌరవాన్ని స్వీకరించడం తనకు ఎంతో ఆనందంగా,గర్వకారణంగా ఉందన్నారు.ఈ గుర్తింపు అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, గురుస్వాములు,కరుణ్ తేజ్ రెడ్డి,రాకేష్ రెడ్డి, రాజేష్, అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి సందర్భంగా ఘనంగా విగ్రహావిష్కరణ




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :రాజా బహదూర్ శ్రీ వెంకట రామారెడ్డి గారి జయంతి సందర్భంగా రాధిక ఎక్స్ రోడ్ వద్ద ఆయన విగ్రహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ సమాజానికి, హైదరాబాద్ నగర అభివృద్ధికి రాజా బహదూర్ వెంకట రామారెడ్డి గారు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ప్రజా సేవకు, విద్యాభివృద్ధికి,సామాజిక సంక్షేమానికి ఆయన అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆయన



ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి ఆదర్శాలను భావితరాలకు చేరవేయవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌పల్లిలో వాటర్ ట్యాంక్ పైప్‌లైన్ కట్



(మన ప్రజా ప్రతినిధి ఆగస్టు 22):మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తుల చర్య కలకలం రేపింది.మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు తాగునీటి పైప్‌లైన్‌ను కోసివేయడంతో గ్రామంలో కలకలం రేగింది. శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామ ప్రజలకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌ను ఉద్దేశపూర్వకంగానే కోసివేశారా? లేక మరేదైనా కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే ఇటువంటి ఘటనలపై అధికారులు వెంటనే స్పందించి, సంఘటనకు కారణమైన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.వాటర్ ట్యాంక్ పరిసరాల్లో భద్రతా చర్యలు చేపట్టి, అవసరమైతే సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అసలు విషయం వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

# బొల్లారం వద్ద అక్రమ ఆయుధాలు పట్టివేత నిందితుడి అరెస్ట్







మనప్రజాప్రతినిధి// మేడ్చల్ :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎస్ఓటీ మల్కాజిగిరి జోన్ పోలీసులు, బొల్లారం లా అండ్ ఆర్డర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 27 ఏళ్ల పర్భాన్స్ కుమార్ అనే వ్యక్తి ప్రస్తుతం పటాన చెరువులోని బీహార్ బస్తీలో నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పర్భాన్స్ కుమార్ అక్రమంగా డ్రై గంజాయి, గంజాయి చాక్లెట్ల విక్రయానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో 2024లో చెర్లపల్లి పోలీసులు అతడిని గంజాయి కేసులో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.ఆ తర్వాత తుపాకులు, తపంచాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అవసరమైన వ్యక్తులకు అధిక ధరలకు విక్రయించాలని పథకం వేసుకున్నాడు.ఈ పథకంలో భాగంగా ఈ నెల 10వ తేదీన ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిన పర్భాన్స్ కుమార్.. సోను అనే వ్యక్తిని సంప్రదించి ఆయుధాలను కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు.సోను నుంచి రెండు 9 ఎంఎం పిస్టల్స్, 17 లైవ్ రౌండ్లు, మూడు మ్యాగజైన్లు,ఒక డబుల్ బ్యారెల్ తపంచా, రెండు లైవ్ రౌండ్లు కొనుగోలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ క్రమంలో ఆగస్టు 22న మధ్యాహ్నం 12 గంటల 10 నిమిషాల సమయంలో బొల్లారం బంగ్లా నంబర్ 13, సాధన మందిర్ సమీపంలో పర్భాన్స్ కుమార్ కదులుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది.దీంతో ఎస్ఓటీ మల్కాజిగిరి జోన్ పోలీసులు, బొల్లారం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పర్భాన్స్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి రెండు 9 ఎంఎం పిస్టల్స్, మూడు మ్యాగజైన్లు, 17 లైవ్ రౌండ్లు, ఒక డబుల్ బ్యారెల్ తపంచా, రెండు లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు.అక్రమ ఆయుధాలను కొనుగోలు చేసి నేరాలకు పాల్పడే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నించిన పర్భాన్స్ కుమార్‌పై బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గురు పురస్కార్‌తో బోడిగా రవి సత్కారం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:కరళ పందలం రాజవంశీకుల చేతుల మీదుగా అవార్డు స్వీకరణ.అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న చర్లపల్లి కీ చెందిన బోడిగా రవి గురుస్వామికి ప్రతిష్ఠాత్మక 'గురు పురస్కార్2026' అవార్డు ప్రదానం చేశారు.చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో మహాసేస్త సేవా సంఘం రాజు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పురస్కార్ ప్రధానోత్సవంలో ఈ అవార్డును కేరళ పందలం రాజవంశీకులు రాజా తిరునల్ సురేష్ వర్మ అందజేశారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 108 మంది గురుస్వాములను ఈ సందర్భంగా సత్కరించి సేవా పురస్కారాలను ప్రదానం చేశారు.అవార్డు అందుకున్న అనంతరం చర్లపల్లి బోడిగా రవి గురుస్వామి మాట్లాడుతూ.. పందలం రాజవంశీకుల చేతుల మీదుగా ఈ గౌరవాన్ని స్వీకరించడం తనకు ఎంతో ఆనందంగా,గర్వకారణంగా ఉందన్నారు.ఈ గుర్తింపు అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ను తలపిస్తున్న సుక్కమ్మ బస్తి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:పండుగ వాతావరణం లో విపరీతమైన చెత్త దుర్గంధం వాసనతో భక్తుల తిప్పలు.మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ పరిధి జవహర్ నగర్ మున్సిపాలిటీ ప్రాంతంలో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న జాతర సమయంలో సుక్కమ్మ కుంట ప్రాంతం అపరిశుభ్రతతో కూడిన డంపింగ్ యార్డ్ ప్రాంతంగా దర్శనమిస్తోంది విపరీతంగా పేరుకుపోయిన ఈ చెత్తను తొలగించాలని మున్సిపాలిటీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చెత్త తొలగింపు విషయంలో నిర్లక్ష్యం వహించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పేరుకుపోయిన ఈ చెత్త నుండి దుర్గంధపు వాసన విరజిమ్మడంతో పాటు ఈగలు దోమలు క్రిమి కీటకాలకు ఆవాసంగా మారి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకొని చెత్తను తొలగించి స్థానికులు అనారోగ్యాల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని లేనియెడల తాగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు

# జీనియస్ స్కూల్ లో "గ్రీన్ డే"



సదాశివపేట మండల్ రిపోర్టర్ ఆగష్టు 22 (మన ప్రజాప్రతినిధి): శనివారం రోజు జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో గ్రీన్ డే నిర్వహించారు విద్యార్థులు గ్రీన్ డే సందర్భంగా ఆకుపచ్చ రంగు లోవస్త్రధారణ మరియు వివిధ రకమైన ఆకృతులను ఆకుపచ్చని రంగులో తయారు చేశారుగ్రీన్ డే సందర్భంగా పాఠశాల ఆవరణలో "వన మహోత్సవం" నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి శ్రీమతి అంజనీ దేవి ఏపీవో శ్రీనివాస్ , సీసీ శేఖర్, మెలిగిరిపేట సర్పంచ్ షాబుద్దీన్ పాల్గొన్నారు ఎంపీడీఓ శ్రీమతి అంజనీ దేవి మాట్లాడుతూ పాఠశాలలో ప్రకృతి పై ప్రేమను అవగాహనను పెంచడానికి గ్రీన్ డే నిర్వహించినందుకు జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమాన్యాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీమతి ముద్ద శశికళ నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్,సెక్రటరీ పోల వెంకటేశం, కరెస్పాండెంట్ రఘు వర్ధన్ రెడ్డి, డైరెక్టర్ అమరేందర్ రెడ్డి,ప్రిన్సిపాల్ ప్రీతి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# 18వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు హామీ




సదాశివపేట మండల్ రిపోర్టర్ ఆగష్టు 22/( మన ప్రజా ప్రతినిధి):సదాశివపేట: 18వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరియు రోడ్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ 18వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి బిట్ల నిఖిత ప్రేమ్ మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ కి వినతిపత్రం సమర్పించారు.వార్డులోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ సాధారణ నిధుల నుండి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు సీసీ రోడ్డు నిర్మించాలని కౌన్సిలర్ కోరారు.ఈ విషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత పనులను పరిశీలించి త్వరలోనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, 18వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు ప్రయత్నం కొనసాగిస్తామని తెలిపారు.

# మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా

## అవంతిపురం గుట్టలో 20 వేల చెట్ల విత్తనాలు చల్లిన – మెగా అభిమానులు




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 22 : మిర్యాలగూడ కు చెందిన చిరంజీవి అభిమానులు అవంతిపురం గుట్టలో సుమారు 20వేల గానుగ చింత వేప గింజలు చల్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అఖిలభారత చిరంజీవి యువత అధ్యక్షులు స్వామి నాయుడు పిలుపుమేరకు పర్యావరణ కార్యక్రమంలో భాగస్వామ్యం అని విత్తనాలు చల్లి పర్యావరణ పరిరక్షణ చల్లడ జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు అవిరెండ్ల సందీప్ కుమార్ కందిగంటి సంజీవ మాసరికళ్యాణ్ కంది కంటి విష్ణు దైద పవన్ కందికంటి ప్రశాంత్ పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



సదాశివపేట మండల్ రిపోర్టర్ ఆగష్టు 22 //( మన ప్రజా ప్రతినిధి):సదాశివపేట కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సదాశివపేట కాంగ్రెస్ పార్టీ మరియు మున్సిపాలిటీ వ్యవహారాల ఇంచార్జ్ తోపాజి అనంత కిషన్ రావడం జరిగింది కార్యకర్తలు నాయకులు దిశా నిర్దేశం చేయడం జరిగింది సీఎం ప్రోగ్రాం సక్సెస్ కావడం పై హర్షం వ్యక్తం చేయడం జరిగింది కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడడం జరిగింది కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున సదాశివపేట డెవలప్మెంట్ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మరియు కార్యకర్తల ఇబ్బందిని జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం చేస్తామని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జణజ చైర్మన్ రామ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, బ్లాక్ ప్రెసిడెంట్ సిద్దన్న పట్టణ అధ్యక్షులు నాగరాజు గారు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ ,మరియు మాజీ వైస్ చైర్మన్ విశ్వనాథం, బీసీ స్టేట్ డైరెక్టర్ పట్నం సుభాష్, జిల్లా జనరల్ సెక్రటరీ అరుణ్, కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# బీజేపీ వన్ టౌన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం



మన ప్రజాప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 22:మిర్యాలగూడ పట్టణ భారతీయ జనతా పార్టీ వన్ టౌన్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శ్రీమతి చిలుకూరి సుధా బాలకృష్ణ పలు ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సీసీ రోడ్ల నిర్మాణం మురికి కాలువల అభివృద్ధి పనులు తారతమ్యం లేకుండా చేపట్టాలని కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా దోమల సమస్య తీవ్రంగా పెరిగిందని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో ఫాగింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పలు వార్డుల్లో వీధికుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని పట్టించి సంరక్షణ కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని వార్డుల్లో సరిపడా వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ ద్వారా రాత్రి వేళల్లో నైట్ పెట్రోలింగ్‌ను మరింత విస్తృతంగా నిర్వహించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ వన్ టౌన్ అధ్యక్షులు బంటు గిరి ఉపాధ్యక్షులు మూల రాజిరెడ్డి, కొంగరి వెంకటరమణ చిలుకూరు వెంకటేశ్వర్లు మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెలుగు ఇందిరా నాగరాజు జిల్లా కార్యవర్గ సభ్యులు వెలుగు నాగరాజు ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు బంటు యాదగిరి ఓబీసీ వన్ టౌన్ అధ్యక్షులు మండల సోములు సీనియర్ నాయకులు చిలుకూరి రమాదేవి శ్యామ్పోరెడ్డి కంచుకొమ్ముల వేణు శివ తదితరులు పాల్గొన్నారు

# నర్సాపూర్ BVRITలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు








మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ 22:నర్సాపూర్: బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BVRIT), నర్సాపూర్‌లో 3వ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రప్రస్థాన్ 2026 పేరుతో రెండు రోజులపాటు సాంకేతిక, విజ్ఞాన ఆధారిత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో అంతరిక్ష సాంకేతికత, ఎంబెడెడ్ సిస్టమ్స్, గ్రహాల అన్వేషణ, భూ వ్యవస్థల శాస్త్రం వంటి ఆధునిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ & హ్యూమానిటీస్, ౸ఋఋ LaunchPad404 Student Space Club సహకారంతో నిర్వహించింది. భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు, అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష సాంకేతిక రంగాల్లో వినూత్న పరిష్కారాలను రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించడం కార్యక్రమం ముఖ్య లక్ష్యంగా నిలిచింది.CHANDRAPRASTHAN 2026లో భాగంగా విద్యార్థులు సాంకేతిక క్విజ్‌లు, విజువల్ ఛాలెంజ్‌లు, ఋ౩౩32 ఆధారంగా స్వయంప్రేరిత గ్రహ ల్యాండర్ పేలోడ్ ప్రోటోటైపింగ్ ఛాలెంజ్ వంటి పలు సాంకేతిక, ఆసక్తికరమైన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ప్రాక్టికల్ సమస్యల పరిష్కారంలో వినియోగించే అవకాశం పొందారు. అలాగే గ్రహాల అన్వేషణలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై అవగాహన పెంచుకున్నారు.CHANDRAPRASTHAN 2026 రెండవ రోజు ×చీజూ×ూ, హైదరాబాద్‌కు చెందిన ౚషఅవత్‌అర్–ఖీ డా. వెంకట్ శేషు రెడ్డెం నిపుణుల ఉపన్యాసం నిర్వహించారు. ఆయన "సముద్రాలు, వాతావరణం మరియు జీవం మధ్య ఉన్న పరస్పర సంబంధాలు" అనే అంశంపై విలువైన అవగాహన కల్పించారు. సముద్ర పరిశీలన, వాతావరణ అధ్యయనాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, భూ వ్యవస్థల పర్యవేక్షణకు అవసరమైన ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతను ఆయన వివరించారు.ఈ నిపుణుల ఉపన్యాసం ద్వారా భూమిపై ఉన్న సహజ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, వాటిని పరిరక్షించడం కోసం శాస్త్రీయ పరిశోధన మరియు సాంకేతిక ఆవిష్కరణల పాత్రపై విద్యార్థులకు విలువైన అవగాహన లభించింది. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తద్వారా భూ మరియు పర్యావరణ శాస్త్రాల్లో జరుగుతున్న సమకాలీన పరిశోధనలు, అభివృద్ధులపై మరింత అవగాహన పొందారు.కార్యక్రమం ముగింపులో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం నిర్వహించడంతో పాటు, ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. CHANDRAPRASTHAN 2026 కార్యక్రమం విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, శాస్త్రీయ ఆవిష్కరణలు మరియు అంతరశాఖ పరిశోధనలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఒక సమర్థవంతమైన వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమంలో విద్యా నాయకత్వం, పరిపాలనా విభాగం, అధ్యాపకులు మరియు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం సంస్థలో శాస్త్రీయ ఆసక్తి, ఆవిష్కరణలు, అంతరశాఖ అభ్యసనం మరియు సాంకేతిక నైపుణ్యాలను ప్రోత్సహించడంలో దీఎ=×ు చూపుతున్న నిబద్ధతను ప్రతిబింబించింది.విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, శాస్త్రవేత్తలు మరియు నిపుణులతో పరస్పర చర్య చేసే అవకాశాలను కల్పిస్తూ, అనుభవపూర్వక అభ్యసన కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ ఆవిష్కర్తలు మరియు అంతరిక్ష రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు BVRIT తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి. ఆర్. సంజీవ రెడ్డితో పాటు అన్ని విభాగాల అధిపతులు (ఎశీణం), డీన్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు CHANDRAPRASTHAN 2026 కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. వారి హాజరు మరియు భాగస్వామ్యం కార్యక్రమానికి మరింత విద్యా ప్రాధాన్యతను, విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించింది.అలాగే ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీ బి. బాపి రాజు మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ యాచీ సురేష్ కార్యక్రమంలో పాల్గొని, చంద్రప్రస్థాన్ 2026 విజయవంతంగా నిర్వహించేందుకు తమ సహకారాన్ని అందించారు.CHANDRAPRASTHAN 2026 వేడుకలు స్ఫూర్తిదాయకంగా ముగిశాయి. విద్యార్థుల్లో అంతరిక్ష విద్య, శాస్త్రీయ ఆలోచన, ఆవిష్కరణలు, అనుభవపూర్వక అభ్యసనం మరియు అంతరశాఖ సహకారాన్ని పెంపొందించేందుకు BVRIT చేస్తున్న కృషికి ఈ కార్యక్రమం మరో విజయవంతమైన ఉదాహరణగా నిలిచింది.

# విద్యార్థులు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నేరేడుచర్ల, (మన ప్రజాప్రతినిధి దినపత్రిక):జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (చీూూూూ) ఆధ్వర్యంలో మండల న్యాయ సేవా కమిటీ, హుజూర్‌నగర్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ నీరజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హుజూర్‌నగర్ సబ్‌కోర్టు సివిల్ న్యాయమూర్తి ఎన్. శ్యామ్ సుందర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు న్యాయ సేవలు, ప్రాథమిక హక్కులు, పౌరుల బాధ్యతలు, ఉచిత న్యాయ సహాయం, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా న్యాయ అధికారులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని, తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు.కార్యక్రమంలో హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.వి. రమణారెడ్డి, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ కాల్వ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. కళాశాల చీూ ప్రోగ్రామ్ ఆఫీసర్ వనపర్తి శ్రీనివాసులు, స్టూడెంట్ కౌన్సిలర్ ఎం. గణేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఎం. సైదులు, ప్రణతి, వెంకన్న, సునీత, నరేందర్, ప్రసాద్, అంజయ్య, నరసింహాచారి, వీరు, వెన్నల, లైబ్రేరియన్ జానకిరాంరెడ్డితో పాటు అధ్యాపకేతర సిబ్బంది అన్వేష్, వెంకన్న, జాన్ ఆఫ్ ఖాన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్, చీూ విభాగం, స్టూడెంట్ కౌన్సిలర్ విభాగం అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ నిర్మాణ పనులు చేపట్టాలి
## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల, ఆగస్టు ,22:వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను ప్రణాళిక ప్రకారం చేపట్టి, వేగవంతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన పురోగతిని అధికారులను అడిగి జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని, నిర్మాణ ప్రక్రియలో జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు మరింత మంది కూలీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ గడువులోగా ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చూడాలని, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు.సమావేశంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ భీమ్లా నాయక్, ఆలయ ఈవో రమాదేవి, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మోతిలాల్ స్థపతి, సూర్యనారాయణ మూర్తి, తదితరులు ఉన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో వైభవంగా 'వనమహోత్సవం'



మనప్రజాప్రతినిధి/ రాజన్నసిరిసిల్లఆగష్టు, 22 :జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత (స్వచ్ఛత) మరియు వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా పాల్గొని, పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎస్పీ నేతృత్వంలో సిబ్బంది కార్యాలయ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. అనంతరం పచ్చదనాన్ని పెంపొందించేందుకు పలు రకాల నీడనిచ్చే, పూల మొక్కలను నాటారు.పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలంఎస్పీ ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ...పోలీస్ కార్యాలయ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచడం వల్ల విధులు నిర్వహించే సిబ్బందికే కాకుండా, తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు కూడా ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందన్నారు.కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి ఎదిగే వరకు ప్రతి ఒక్కరూ దత్తత తీసుకుని సంరక్షించే బాధ్యత చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు మధుకర్, సురేష్, రమేష్; సి.ఐ లు మొగిలి, మధుకర్; ఎస్.ఐ కిరణ్ కుమార్; ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రవణ్, సాయికిరణ్, దిలీప్, రాజులతో పాటు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా,కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి
## తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో..




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. యూరియా,ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఎక్కువ ధరలకు విక్రయించే దాన్ని నియంత్రించి ఎమ్మార్పీ రేట్లకు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం రోజున వ్యవసాయ శాఖ చేర్యాల ఏ డి ఏ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ రజిని కి తెలంగాణ రైతు సంఘం పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో మెమోరండాన్ని సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో మాట్లాడుతూ సరియైన వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న స్థితిలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ యూరియా అవసరాలకు కాంప్లెక్స్ ఎరువుల అవసరాలకు ఎరువుల షాపుల్లోకి వచ్చినప్పుడు ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతుల అవసరాన్నీ,ఆసరా చేసుకుని ఎరువులు,యూరియా కొరత ఉందని యాప్ లో బుక్ చేయాలని చెప్పి ఎమ్మార్పీ రేట్లకు కాకుండా యూరియా ఎమ్మార్పీ రేటు రెండు వందల అరవై ఏడు రూపాయలు ఉండగా మూడు వందల యాభై నుండి ఐదు వందల రూపాయల వరకు తీసుకుంటున్నారని అదనంగా ఇతర సరుకులు అవసరం లేకున్నా కొనుగోలు చేయాలని అలా కొనుగోలు చేస్తేనే యూరియా ను ఇస్తామని రైతులను ఇరకాటంలో పెట్టి రైతులను ఇబ్బందుల పాల చేస్తున్నారని కాంప్లెక్స్ ఎరువుల ధరలను ప్రతి బస్తా పెరిగిన ధరల పైన రెండు వందల నుండి ఐదు వందల వరకు అదనంగా తీసుకుంటున్నారని యూరియాకు గాని కాంప్లెక్స్ ఎరువులకు గాని ఇతర వాటికి గాని ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని ఫర్టిలైజర్ షాపులో యజమానులు ఒక్కటిగా కుమ్మక్కై ఈ రకంగా చేస్తున్నారని ఏ షాపుకు వెళ్లిన ఇదే పరిస్థితి రైతులకు ఎదురు కావడంతో గత్యంతరం లేక ఫర్టిలైజర్ షాపులో యజమానులు అన్నా ధరకు డబ్బులు చెల్లించి తీసుకపోతున్నారని ఇంత జరుగుతున్నా అగ్రికల్చర్ అధికారులు ఏమాత్రం పట్టనట్టు చేసిన వ్యవహరిస్తున్నారని వెంటనే ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి ప్రతి కొనుగోలుపై బిల్లులు ఇచ్చే విధంగా యూరియా,ఫర్టిలైజర్ కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీ రేట్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని యూరియా తో అదనంగా ఇతర పురుగుమందులను, గుళికలను తీసుకుంటేనే యూరియా ఇస్తానని పద్ధతి మాన్పించే విధంగా ప్రతి ఫర్టిలైజర్ షాప్ లో స్టాక్ బోర్డు ధరల పట్టికను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రైతాంగాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని,రైతులు ఈ రైతు సంఘం నిర్వహించే ఆందోళన పోరాటాల్లో అధిక సంఖ్యలో పాల్గొని రైతులకు జరిగే నష్టాన్ని అరికట్టేందుకు భాగస్వాములు కావాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో చేర్యాల పట్టణ రైతు సంఘం కార్యదర్శి తుప్పతిరాజు,రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి నంగి మైసయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బడి పిల్లలకు ప్లేట్ల పంపిణీ
## రుద్వేద్ రెడ్డి 3వ పుట్టినరోజు సందర్భంగా సూదిరెడ్డి దంపతుల ఉదారత



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్లఆగష్టు ,22:సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట 12వ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వినూత్నంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. స్థానిక సూదిరెడ్డి ప్రదీప్ రెడ్డి - శ్రీవాణి దంపతుల కుమారుడు రుద్వేద్ రెడ్డి 3వ పుట్టినరోజును పురస్కరించుకుని, పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి, శ్రీవాణి దంపతులు మాట్లాడుతూ "బయట హంగులు, ఆర్భాటాలకు అనవసర ఖర్చులు చేయకుండా, పాఠశాల విద్యార్థుల మధ్య కుమారుడి పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చింది. వేడుకలను ఇలాంటి సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందించవచ్చు" అని తెలిపారు. అలాగే, తమను ఆదర్శంగా తీసుకుని నేటి యువత కూడా పుట్టినరోజుల వేళ పేద విద్యార్థులకు, నిరుపేదలకు తమకు తోచిన సాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ మొగిలి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ కంది సుజాత, పాఠశాల హెడ్మాస్టర్ కైరి పద్మ, ఉపాధ్యాయ బృందం, యువకులు పసుల వేణు, బీనవేణి శ్రీకాంత్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు




# నీట్ విద్యార్థిని హత్యతో దేశవ్యాప్తంగా సంచలనం



వారణాసి, ఆగస్టు 22 (మనప్రజాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ యువతి హత్యకు గురైన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. వైద్య విద్యలో ప్రవేశం సాధించాలని కలలుగన్న ఆ యువతి ఆగస్టు 18న కళాశాలకు వెళు తున్నానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజులపాటు ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఎవరూ ఊహించని విధంగా ఆమె మృతదేహం ప్రియుడు వివేక్ చౌబే అద్దెకు ఉంటున్న గదిలోని బాత్రూంలో కుళ్లిపోయిన స్థితిలో బయటపడటంతో ఈ ఘటన సంచలనంగా మారింది. ఉన్నత చదువులు పూర్తి చేసి వైద్యురాలిగా సేవలందించాలని ఆశపడిన యువతి జీవితానికి ఇంత దారుణ ముగింపు రావడం స్థానికులను కలచివేసింది. యువతి కనిపించకపోవడంతో పోలీసులు ఆమె మొబైల్ ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. చివరిసారిగా ఆమె ఫోన్ వారణాసిలోని మాలవీయ ఇంటర్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో పనిచేసినట్లు గుర్తించారు. ఇదే సమయంలో యువతి తల్లి, బంధువులు స్వయంగా ఆచూకీ కోసం అన్వేషణ చేపట్టారు. ఈ క్రమంలో మీర్జాపూర్ జిల్లాలోని సీఖర్ గ్రామంలో ఉన్న నిందితుడు వివేక్ చౌబే మేనమామ ఇంట్లో యువతికి చెందిన బ్యాగ్ కనిపించింది. అందులో దొరికిన తాళం చెవిని తీసుకుని నిందితుడు ఉంటున్న గదికి వెళ్లి పరిశీలించగా బాత్రూంలో దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. తలుపు తెరిచి చూడగా యువతి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన హత్య అయ్యి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.పోస్టుమార్టం నివేదికలో యువతి గొంతు కోయడం వల్లే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె తలపై తీవ్ర గాయాలు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా కాళ్లు కట్టివేయబడిన స్థితిలో మృతదేహం లభించడం కేసును మరింత భయానకంగా మార్చింది. యువతిపై లైంగిక దాడి కూడా జరిగి ఉండవచ్చనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పష్టత కోసం ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మృతదేహం లభించిన గదిలో రక్తపు మరకలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్న అధికారులు వాటిని శాస్త్రీయ పరీక్షల కోసం పంపించారు. ఈ ఘటనలో మరెవరైనా పాల్గొన్నారా, హత్య తర్వాత ఆధారాలను తొలగించే ప్రయత్నాలు జరిగాయా అనే అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు ఈ కేసుకు మరింత ప్రాధాన్యత తెచ్చాయి. వారి కథనం ప్రకారం వివేక్ చౌబే కొంతకాలంగా యువతిని వేధిస్తున్నాడు. ఆమె వేరే వ్యక్తిని వివాహం చేసుకుంటే మార్ఫింగ్ చేసిన ఫొటోలను సామాజిక